క్లుప్తంగా

ఉపాధి హామీ గ్రామసభ



ముప్పాళ్ళ: ముప్పాళ్ల గ్రామ సచివాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభ గురువారం జరిగింది. డీఆర్పీ టి.ఖాజా పాల్గొని 2021–22 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో జరిగిన పనులు, హాజరైన కూలీల వివరాలను చదివి వినిపించారు. సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై చర్చించారు. ఏమైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని జాబ్‌కార్డుదారులను కోరారు. గ్రామ సభలో సర్పంచ్ ఎమ్.సతీష్, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ రామారావు, పంచాయతీ కార్యదర్శి ఆర్.నాగేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యుడు అజ్గర్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్



మాదల(ముప్పాళ్ళ): మాదల, గోళ్ళపాడు గ్రామాల్లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గురువారం జరిగింది. పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, ఎస్.సూర్యప్రకాశరావు 119 మందికి వైద్యసేవలందించారు. అవసరమైన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన వారి వద్దకు వెళ్ళి చికిత్స అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పీటర్ డానియేన్, రవితేజ, రవిచంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ పావని, ఏఎన్‌ఎమ్ రావమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులు



అమరావతి: నరుకుళ్ళపాడు ఎంపీయూపీ, ఎనికపాడు ఎంపీపీ స్కూళ్లలో 50 మంది విద్యార్థులకు గురువారం కోరమాండల్ కంపెనీ ఆధ్వర్యంలో స్థానిక మన గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులు భోజనం ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. వీటిని ఎంపీడీఓ మాధురి, ఎంఈఓ శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ డీడీఏ మురళీకృష్ణ చేతులమీదుగా అందించారు. కార్యక్రమంలో కోరమాండల్ కంపెనీ జోనల్ హెడ్ ఆర్.షణ్ముఖి, మన గ్రోమోర్ మేనేజర్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం



పెదకూరపాడు: సామాజిక ఆరోగ్య కేంద్రం, 75 త్యాళ్లూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా గర్భిణులకు పౌష్టికాహారం అందించారు. అనంతరం నిర్వాహకులు మాగులూరి కృష్ణారావు మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు మాధవిలత, డాక్టర్ వెలుగొండారెడ్డి, సూపర్‌వైజర్ దిలీప్‌కుమార్, ఫౌండేషన్ నిర్వాహకులు కిరణ్‌కుమార్, కొండవీటి ప్రసాద్, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బెల్లంకొండ రామ్‌గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్య స్వామి తిరునాళ్ల



88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88 త్యాళ్లూరు గ్రామంలో లక్ష్మీతిరుపతమ్మ తల్లి గోపయ్య స్వామి తిరునాళ్ల మహోత్సవం గురువారం జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తిరునాళ్లకు విశేషంగా హాజరయ్యారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం వినతి

అమరావతి: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం గురువారం మండల పెన్షనర్ల అసోసియేషన్ ప్రతినిధులు తహసీల్దార్ విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని తొమ్మిది అంశాలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మండల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, సంఘప్రతినిధులు కె.తిమ్మయ్య, కేవీఎస్ శర్మ, కె.హనుమంతరావు, భాస్కరరెడ్డి, కోటయ్య, ఎన్.గణేశ్వరరావు, రామయ్య, నంబూరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో సంక్షేమ విప్లవం

- పేదల ముఖాల్లో చిరునవ్వే లక్ష్యం
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు
- రెంటపాళ్ల సచివాలయానికి మూడేళ్లలో రూ.21.65 కోట్లు
- సంక్షేమ సాయం రూ.20.58 కోట్లు
- అభివృద్ధి పనులకు రూ.1.07 కోట్లు



రెంటపాళ్ళలో వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నవరత్న పథకాలతో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ విప్లవం తీసుకువచ్చారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామంలో గురువారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి మూడేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధి గురించి వివరించారు. పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. బుక్‌లెట్లను అందించారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. వ్యవసాయం, విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టినట్టు వివరించారు. ప్రజాశీస్సులే ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఎన్నికల హామీల్లో 95 శాతం నెరవేర్చామని పేర్కొన్నారు. కులాలు, మతాలు, పార్టీలు, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరుస్తున్నామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా వైఎస్సార్ సీపీకే పట్టం కడతారని ధీమా వ్యక్తంచేశారు.

1,876 కుటుంబాలకు ప్రయోజనం

రెంటపాళ్ళ సచివాలయ పరిధిలో మూడేళ్లలో రూ.21.65 కోట్ల మేర ప్రయోజనం చేకూరిందని మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. దీనిలో సంక్షేమ పథకాల ద్వారా రూ.20.58 కోట్ల లబ్ధి చేకూరగా, అభివృద్ధి పనులకు రూ.1.07 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. గ్రామంలో మొత్తం 1,980 కుటుంబాలు ఉంటే 1,876 కుటుంబాలు లబ్ధి పొందాయని వివరించారు.

కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏకుల మనీషా, ఎంపీటీసీ సభ్యులు నక్కా పద్మ, వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పాకాలపాడు పీఏసీఎస్ అధ్యక్షుడు కొర్లకుంట వెంకటేశ్వర్లు, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత్ శివ ప్రసాద్, నాయకులు చల్లా శ్రీనివాసరావు, కొమెర శివశంకర్, పల్లె గాబ్రియేలు, మారిశెట్టి సైదయ్య, సాంబ, సహదేవుడు, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు సత్ప్రవర్తన కలిగి ఉండాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐలు

రాజుపాలెం: విద్యార్థి దశ నుంచే సత్ప్రవర్తన కలిగి ఉంటే జీవితంలో విజయం సొంతమవుతుందని పల్నాడు జిల్లా యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్‌ఐలు వి.గౌతమి, వైసీహెచ్ అల్లూరిరెడ్డి చెప్పారు. అనుపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలు, మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎస్‌ఐలు మాట్లాడుతూ ఆపద సమయంలో దిశా యాప్‌ను వినియోగించుకోవాలని సూచించారు. 1098, 102, 100 హెల్ప్‌లైన్ నంబర్లను గురించి వివరించారు. ప్రతిఒక్కరూ నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సానికొమ్ము వెంకటసుబ్బమ్మ శ్రీనివాసరెడ్డి, ఎన్‌జీఓ ఆర్గనైజేషన్ నిర్వాహకులు మాజీ సర్పంచ్ రామాంజనేయులు, పాఠశాల కమిటీ చైర్మన్ ఎస్ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎమ్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి



బాలికలతో మాట్లాడుతున్న విజయ ప్రతాప్‌రెడ్డి

బెల్లంకొండ: పాఠశాలలో బాలికలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్‌రెడ్డి తెలిపారు. బెల్లంకొండ క్రాస్‌రోడ్ వద్ద గల కేజీబీవీ పాఠశాలను బుధవారం రాత్రి ఆయన సందర్శించారు. బాలికలతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. భోజనం గురించి ఆరా తీశారు. మెనూ ప్రకారం తాము ఇష్టంగా తినేలా భోజనం అందిస్తున్నారని బాలికలు చైర్మన్‌కు తెలిపారు. వంటశాలకు వెళ్లి విద్యార్థుల కోసం తయారు చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణతో పాటుగా వంటశాల పరిశుభ్రంగా ఉండడంతో పాఠశాల సిబ్బందిని ఆయన అభినందించారు. ఆయన వెంట ఎంఈఓ మల్లికార్జున శర్మ, ఎంపీడీఓ వెంకటరెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మి అమ్మవారి జాతరపై అధికారుల సమీక్ష



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ నరసింహబాబు

దుర్గి: ఈ నెల 12న ఆదివారం నిర్వహించనున్న శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవం విజయవంతానికి తీసుకోవాల్సి చర్యలపై గురువారం స్థానిక ఆలయ ప్రాంగణంలో మండలస్థాయి అధికారులు సమీక్ష సమావేశం నిర్వహించారు. విద్యుత్ ఏఈ రాంబాబు మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ.. ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జాతరకు 11, 12, 13 తేదీలు ఎంతో కీలకమన్నారు. అడిగొప్పల నుంచి దేవాలయానికి వచ్చే ప్రధాన రహదారిపై నిర్మించిన నూతన బ్రిడ్జి, రెండు అతిథి గదులు ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆఫీసు సీనియర్ అసిస్టెంట్ రాజు, ఆర్డీసీ సూపర్‌వైజర్ ఎం.లచ్చయ్య తదితరులున్నారు.

అటవీ భూముల్లోకి వెళ్తే.. కేసులు నమోదు చేస్తాం



సదస్సులో మాట్లాడుతున్న డీఆర్వో మురళీ

దాచేపల్లి: అటవీ భూముల్లోకి వెళ్తే కేసులు నమోదు చేస్తామని అటవీ శాఖ డీఆర్వో మురళీ హెచ్చరించారు. మండలంలోని శంకరపురం గ్రామంలో గురువారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో మురళీ మాట్లాడుతూ..శంకరపురం గ్రామ సమీపంలోని అటవీ భూముల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకున్నామని, నిబంధనలు అతిక్రమించి ప్రవేశిస్తే పీడీ యాక్టు కింద కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అటవీ భూములను రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తాము ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్న అటవీ భూములకు పట్టాలు ఇప్పించాలని అధికారులను గ్రామస్తులు కోరారు. అందుకు స్పందించిన ఆయన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో సర్పంచ్ జంగా సురేష్, వీఆర్వో పత్రా రమేష్, అటవీశాఖ అధికారులు శేఖర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాలు



రెంటచింతల: సుబ్బన్నతోట కాలనీలోని అలివేలుమంగ, పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానం 19వ వార్షికోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభంకానున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు నాళం పెద్దబాబు, ప్రధాన అర్చకుడు ఓరుగంటి మారుతిశర్మ గురువారం తెలిపారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ తదితర పూజా కార్యక్రమాలతో పాటు 9.30గంటలకు లక్ష తులసీదళార్చన భక్తి శ్రద్ధలతో నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలను అందజేయడం జరుగుతుందన్నారు. శనివారం ఉదయం స్వామి వారి శాంతి కల్యాణం మహోత్సవాన్ని నిర్వహించి, మధ్యాహ్నం భక్తులకు మహాన్నదానం చేయనున్నట్లు దేవస్థానం పాలక వర్గం సభ్యులు తెలిపారు.

మహిళా సర్పంచ్‌కు సన్మానం



క్రోసూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం క్రోసూరు పంచాయతీ అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు సర్పంచ్ మల్లా చందమామను సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శరతబాబు, ఆదినారాయణ, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, నాయకులు గార్లపాటిదాసు, డాక్టర్ షరీఫ్, గనుపల్లిరాజశేఖర్, పాస్టర్ జె.జేమ్స్, చిల్కార వి, మేదరరోశయ్య,నందిగం దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

మామిడి సాగుపై అవగాహన



రాజుపాలెం: ఉష్ణోగ్రతలు పెరుగుతున్నందున మామిడి తోటలో పూత, పిందె రాలకుండా ఉండాలంటే 5 గ్రాముల పొటాషియం నైట్రేట్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని ఉద్యాన అధికారి దాసరి నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని అంచులవారిపాలెం గ్రామ సచివాలయంలో గురువారం మామిడి సాగు వేసిన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యాన అధికారి నవీన్ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్న సమయంలో నీరు ఎక్కువగా పెట్టడం వల్ల పూత రాలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, తేలిక తడులను పెట్టాలని సూచించారు.

తప్పిన ప్రమాదం

సత్తెనపల్లి: పెనుప్రమాదం తప్పింది. సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు వద్ద గురువారం గడ్డి ట్రాక్టర్‌ను కంటైనర్ ఢీ కొట్టడంతో ట్రాక్టర్ తిరగబడింది. ట్రాక్టర్ ముందు భాగం ధ్వసమైంది. ట్రక్కు తిరగ బడటంతో వరిగడ్డి చెల్లాచెదురైంది. ఈ ఘటనలో ఎవరికీ ఏమీ కాలేదు.

నేడు ఎమ్మెల్యే, ఎంపీ పర్యటన

అచ్చంపేట: పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు శుక్రవారం అచ్చంపేట మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య గురువారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు చెరుకుంపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్, జీడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టరు చింతగుంట్ల రామిరెడ్డి విగ్రహావిష్కరణలో పాల్గొంటారని వివరించారు. అనంతరం మిట్టపాలెంలో రూ.6 లక్షల అంచనా వ్యయంతో నిర్మించే పాఠశాల అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తారని వెల్లడించారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ

కరెంట్ సరఫరాకు అంతరాయం

పెదకూరపాడు: పెదకూరపాడు పాటిబండ్ల రహదారిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం సమీపంలో విద్యుత్ స్తంభాన్ని ఇసుక లారీ ఢీకొంది. దీంతో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కరెంట్ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో ప్రతినెలా స్కానింగ్ కోసం సీహెచ్‌సీకి వచ్చే గర్భిణులు విద్యుత్ లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జనరేటర్ సౌకర్యం లేకపోవడంతో 35 మంది గర్భిణులు వెనుదిరిగారు. గైనకాలజిస్టు డాక్టర్ మాధవిలత మాట్లాడుతూ 12 గంటల్లోపు 40 మందికి స్కానింగ్ చేశామని, విద్యుత్ అంతరాయంతో మిగిలిన 35 మందికి చేయలేదని, వారు వచ్చే నెల వరకు వేచి ఉండకుండా సోమవారం ఆరోగ్య కేంద్రానికి వస్తే స్కానింగ్ చేస్తామని వివరించారు.

ప్రగతి నారీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న నంబూరు వసంతకుమారి తదితరులు

పెదకూరపాడు: గుంటూరులో శనివారం జరిగే ప్రగతి నారీ శక్తి అవార్డుల ఆహ్వాన పత్రిక, వాల్‌పోస్టర్లను పెదకూరపాడు శాసన సభ్యుడు నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వసంతకుమారి మాట్లాడుతూ ప్రతిభ చాటుతున్న మహిళలను సత్కరించుకోవడం అందరి బాధ్యతని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రగతి నారీ శక్తి గౌరవ అధ్యక్షురాలు రాజకుమారి, జాతీయ అధ్యక్షురాలు పి.దేవి, దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ చైర్మన్ అనురాధరెడ్డి పాల్గొన్నారు.

చైతన్య గోదావరి బ్యాంకు మెరుగైన సేవలు



బ్యాంకు శాఖను ప్రారంభిస్తున్న కామేశ్వరరావు

పెదకూరపాడు: రైతులు, విద్యార్థులకు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మెరుగైన సేవలు అందిస్తోందని బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు చెప్పారు. గురువారం లగడపాడు గ్రామంలో చైతన్యగోదావరి గ్రామీణ బ్యాంకు 242వ శాఖను ప్రారంభించారు. ఖాతాదారుల సమావేశంలో కామేశ్వరరావు మాట్లాడుతూ వడ్డీరేట్లు ఇతర బ్యాంకు కన్నా తక్కువగా ఉంటాయని వివరించారు. చిన్న, సన్నకారు రైతులకు, బలహీన వర్గాలకు బ్యాంకు చేయూతనిస్తోందని చెప్పారు. తమ బ్యాంకు నాలుగు ప్రాంతీయ కార్యాలయాలతోపాటు, 242 శాఖలతో పనిచేస్తోందని పేర్కొన్నారు. మొత్తం 7,670 కోట్లకు పైగా డిపాజిట్లు స్వీకరించి 8,300 కోట్ల రుణాలు మంజూరు చేసిందని వివరించారు. కార్యక్రమంలో నరసరావుపేట ప్రాంతీయ మేనేజర్ మారుతీరావు, బ్రాంచ్ మేనేజర్ చైతన్య, క్యాషియర్ యశ్వంత్, సిబ్బంది చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యకుమార్, అరవింద్, సాంబశివనాయక్, సువర్ణరాజు, వెలమయ్య, అనిల్, తిమ్మయ్య, రామ్‌ప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు మైనేని నరేంద్ర పాల్గొన్నారు.

రక్తహీనతను అధిగమించాలి



సిబ్బందికి సూచనలిస్తున్న డెప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ చంద్రశేఖర్

నకరికల్లు: గర్భిణులు రక్తహీనత తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటే సుఖప్రసవంలో పండంటి బిడ్డకు జన్మనివ్వవచ్చని డెప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ, ఫ్యామిలీ ఫిజిషియన్ ప్రోగ్రాం జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ సూచించారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నకరికల్లులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో చేపడుతున్న ఫ్యామిలీ ఫిజిషియన్ క్యాంపుల గురించి డాక్టర్ చంద్రశేఖర్ వాకబు చేశారు. ఏయే గ్రామాలకు ఎప్పుడు వెళ్లాలో ముందుగా తేదీలు నిర్ణయించుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా శస్త్రచికిత్సలు చేయించుకున్న వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్యపరిస్థితిని ఆరా తీశారు. వైద్యశాలలో అందుబాటులో ఉన్న వ్యాక్సిన్లు, మందులను తనిఖీ చేశారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు వి.శ్రీనునాయక్, బి.నాగమణి, సీహెచ్‌ఓ కె.మల్లయ్య, సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘ నేత రామారావు మృతి



అన్నం వెంకట రామారావు భౌతికకాయానికి పూలమాల వేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ఆర్యవైశ్య సంఘ పట్టణ మాజీ అధ్యక్షుడు అన్నం వెంకట రామారావు(64) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన భౌతిక కాయాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, వాకుమళ్ళ చెంచిరెడ్డి, ఆర్యవైశ్య నాయకులు శింగరి మధుసూధన్‌రావు, దేవతి సుబ్బారావు, జెమిలి రాధాకృష్ణమూర్తి, మాడా రమేష్ తదితరులు పాల్గొన్నారు. సత్తెనపల్లి పట్టణంలోని వాసవీ టవర్స్ నుంచి శుక్రవారం ఉదయం 10 గంటలకు అన్నం వెంకట రామారావు అతిమయాత్ర కొనసాగుతుందని ఆయన కుటుంబ సభ్యులు తెలియజేశారు.

120 మంది గర్భిణులకు అమృతాహారం



గర్భిణులకు అమృతాహారాన్ని అందజేస్తున్న దృశ్యం

అచ్చంపేట: సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 120 మంది గర్భిణులకు పౌష్టిక విలువలతో కూడిన అమృతాహారాన్ని గురువారం పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధి తిమ్మిశెట్టి రాంబాబు మాట్లాడుతూ ఐదు నెలలుగా ప్రతి నెలా 9న తమ సంస్థ ఆధ్వర్యంలో గర్భిణులకు అమృతాహారాన్ని అందజేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శ్యామల, డాక్టర్ రాజేష్, ప్రముఖ వైద్యులు మామిళ్లపల్లి మధుసూదనరావు సతీమణి విజయలక్ష్మి, సంస్థ సభ్యులు గొల్లపూడి అనిల్‌కుమార్, సూదా సదాశివరావు, గార్లపాటి సాంబశివరావు, పాట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ బహూకరణ



ఇన్వర్టర్ అందుకుంటున్న ప్రిన్సిపల్ స్వర్ణకుమారి

సత్తెనపల్లి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు ఈశ్వర కళాశాల 15వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఇన్వర్టర్‌ను బహూకరించారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ షేక్ దాదాసాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్టు వివరించారు. గురుకుల కళాశాల ప్రిన్సిపల్ స్వర్ణకుమారికి ఇన్వర్టర్ అందించారు. కార్యక్రమంలో ఈశ్వర కళాశాల హెచ్‌ఆర్ మేనేజర్ యాదగిరి వెంకటేష్, ఇన్‌చార్జ్ కవిత తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అయప్పస్వామికి పూజలు

రెంటాల(రెంటచింతల): రెంటాల గ్రామంలోని పాండురంగస్వామి దేవస్థానంలో అయప్పస్వామి జన్మదిన వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురుస్వామి సత్రశాల మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అనీల్‌కుమార్ శర్మ అయప్పస్వామి పడిపూజను కేరళ సాంప్రదాయం ప్రకారం నిర్వహించారు. వివిధ రకాల అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.